క్లుప్తంగా

21మందికి కోవిడ్ నెగిటివ్

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల పరిధిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 21 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చాయని వైద్యాధికారులు తెలియజేశారు.

కంటివెలుగుకు విశేష స్పందన

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా రెండో విడత కంటివెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో 222 మందికి, కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 107 మంది, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో 111 మంది, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాలు, సూరారం లుయీస్ బ్రెయిలీ కమిటీహాలు, సుభాష్‌నగర్ బస్తీ దవాఖానా, పద్మానగర్ కమ్యూనిటీ హాలు, దుర్గా ఎస్టేట్స్ కమ్యూనిటీ హాలులలో 696 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.24వేల వేతనం ఇవ్వాలి

కుత్బుల్లాపూర్: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ... జీఓ నం.4 ప్రకారం మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.24వేల కనీస వేతనాన్ని ఇవ్వడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ జీఓ జారీ చేసి సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయడం లేదని ఆరోపించారు. కనీస వేతనాలను వర్తింపజేయకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు రాములు, హరినాథ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి సంజయ్‌పురి కాలనీ నాయకులు

దుండిగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ విధానాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్‌పురి కాలనీకి చెందిన 50 మంది బీజేపీ నాయకులు కార్పొరేటర్ జగన్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి శంభీపూర్‌రాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

- దుండిగల్ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ జాతర మహోత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ఆలయ కమిటీ సభ్యురాలు దొడ్ల మంజుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కావలి గణేష్, మాజీ ఎంపీటీసీ బండారి మహేష్, నాయకులు ఆకుల ప్రేమ్‌కుమార్, విజయ రామిరెడ్డి, భీమ్‌సింగ్, నవీన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'గృహకల్ప ఇళ్లు ఇతరులకు కేటాయించడం దారుణం'

సాక్షి,మేడ్చల్ జిల్లా: దమ్మాయిగూడ మున్సిపాలిటీ బండ్లగూడ రాజీవ్ గృహకల్పలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న కుటుంబాలను బయటకు వెళ్లగొట్టి వేరే ప్రాంతాల్లోని అధికార పార్టీ నాయకులకు ఆ గృహాలను కేటాయించడం దారుణని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ఈగ శ్వేత ఆధ్వర్యంలో బండ్లగూడ గృహకల్ప కుటుంబాలతో కలిసి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న రాజీవ్ గృహకల్పలో నిరుపేదలకే ఆ ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. గోగుల సరిత వెంకటేష్, సామల శ్రీనివాసరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, సుమేష్, సిరిసిల్ల శ్రీనివాస్,వైఎస్ గౌడ్,భీమిడి జైపాల్‌రెడ్డి, మేకల మహేందర్‌యాదవ్, జగన్, బిక్షపతి సాగడ రాజు, సత్యం, సాగడ రమేష్ పాల్గొన్నారు.

పొగ కమ్మేసింది.!



జగద్గిరిగుట్టలోని హచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయిన చెత్తను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా పొగ రావడంతో కాలనీల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. - సాక్షి,సిటీబ్యూరో

పాకెట్ మనీతో పిక్‌నిక్ తీసుకెళ్లారు..



సుభాష్‌నగర్: తమ తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో ఎంబీఏ చదువుతున్న ఇద్దరు అన్నదమ్ములు పేద విద్యార్థులను విహారయాత్ర తీసుకెళ్లి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మద్దూర్‌లోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్ చూడాలని కోరిక ఉండేది. వారి కల కలగానే ఉండేది. ఆ విద్యార్థుల్లో సూరారం చెందిన వారు ఉండడంతో ఈ విషయం సుభాష్‌నగర్ డివిజన్ నరసింహబస్తీకి చెందిన ఎంబీఏ చదువుతున్న దొంతిరి కార్తీక్‌రెడ్డి, జయవర్ధన్‌రెడ్డిలకు తెలిసింది. తాము జమ చేసిన పాకెట్‌మనీతో 75 మంది విద్యార్థులకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసి నగరంలోని బిర్లా ప్లానిటోరియం, సాలార్జంగ్ మ్యూజియం, ఎన్టీఆర్ పార్క్, గోల్కొండ, నెక్లెస్ రోడ్ పలు ప్రాంతాలను చూపించారు. అనంతరం వారికి భోజన సదుపాయం కల్పించి, స్పోర్ట్స్ వస్తువులను అందజేశారు.

నేనేమి చేశాను నేరం?



ఉషోదయటవర్ నుంచి అయోధ్యనగర్ వెళ్లే ప్రధాన రోడ్డులో చెట్ల నరికివేత

సుభాష్‌నగర్: పీల్చే గాలినిచ్చే.. నిలువ నీడనిచ్చే చెట్టు చివరికి తన ఉనికిని కోల్పోతోంది. తనపై పడ్డ గొడ్డలి వేటును, గాయాలను చూపిస్తూ నేనేమి చేశాను నేరం అంటూ సమాజాన్ని ప్రశ్నిస్తోంది. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉంటే కొమ్మలు తొలగించాల్సిన సిబ్బంది ఏకంగా మొద్దు వరకు చెట్టును నరికేశారు. ఈ చెట్ల నరికివేత షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ నుంచి అయోధ్యనగర్ వెళ్లే రోడ్డులో జరిగింది. ఏళ్ల నాటి చెట్లను నరికేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణ ప్రేమికులు సంబంధిత శాఖ అధికారులపై మండిపడుతున్నారు. హరితహారాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వం మరి దీనిపై స్పందించి కారకులపై చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి.

మొదట పొగ గాల్లోకి.. ఆ తర్వాత ప్రాణాలు!

రంగారెడ్డినగర్: పరిశ్రమలు విచ్చలవిడిగా గాల్లోకి విష వాయువులు, ఘాటైన పొగలను వదులుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడలోని కొన్ని పరిశ్రమలు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి. మధ్యాహ్న వేళల్లో ఘాటైన వాయువులను వదలడంతో నందానగర్, పంచశీలకాలనీ, బస్తీల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పీసీబీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపే పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



నందానగర్‌ను ఆనుకుని ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగలు

మహాత్మాగాంధీకి నివాళులు

మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం గాంధీ చేసిన పోరాటాలు, సత్యగ్రహాలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేసి ఆయన సేవలను కొనియాడారు.

- రంగారెడ్డినగర్



గాంధీనగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పిస్తూ..



భౌరంపేట్‌లో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి



జగద్గిరిగుట్టలో జేఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య ఆధ్వర్యంలో..



టీపీసీసీ కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి ఆధ్వర్యంలో..

రాజీవ్‌గృహకల్పలో సదుపాయాలు మెరుగుపర్చాలి

- జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి



డీసీ మంగతాయారుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: సూరారం రాజీవ్‌గృహకల్పలో మౌలిక సదుపాయాలను మెరుగు పర్చాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ మంగతాయారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. గృహకల్ప ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారాయని అన్నారు. రోడ్లపై డ్రైనేజీ పారుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది విషజ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. సరైన రోడ్డు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఉపకమిషనర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన డీసీ మంగతయారు సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి జీకే శేఖర్‌యాదవ్, సుభాష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు, దళిత మోర్చా డివిజన్ అధ్యక్షుడు రాము, సురేష్‌రెడ్డి, నర్సింహులు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాపటేల్, అరుణరెడ్డి, డివిజన్ కార్యదర్శి గంధం కుమారస్వామి, శ్రీను తదితరులు ఉన్నారు.

పత్తికుంట, బంధంచెరువు భూములను పరిరక్షించాలి

మేడ్చల్ ప్రజావాణిలో బీజేపీ నాయకుల ఫిర్యాదు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని పత్తికుంట, బంధం చెరువు శిఖం భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువులను పరిరక్షించాలని సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ మాట్లాడుతూ... బాచుపల్లి సర్వే నం.248లోని 6.21 ఎకరాల్లో బంధం చెరువు విస్తరించి ఉండగా అధికారులు 3.433 ఎకరాలను ఎఫ్‌టీఎల్‌గా గుర్తిస్తూ 2017లో నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. దీంతో మిగిలిన మూడు ఎకరాలను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేశారని తెలిపారు. విజన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి టీఎస్‌బీ పాస్ ద్వారా హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు అనుమతులు సైతం మంజూరు చేశారన్నారు.

- అదే విధంగా సర్వే నం.283లోని 13.23 ఎకరాల్లో పత్తికుంట చెరువు విస్తరించి ఉండగా 2014లో హెచ్‌ఎండీఏ అధికారులు 5.289 ఎకరాలుగా గుర్తిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. దీంతో మిగిలిన 8 ఎకరాలు కబ్జాకు గురై అందులో సప్తపది ఫంక్షన్‌హాల్, శ్రీరామ్ సీబీఎస్‌ఈ స్కూల్ బిల్డింగ్, ఇతర పక్కా గృహాలను నిర్మించారని పేర్కొన్నారు. కబ్జాదారులకు మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. చెరువు స్థలాలను అక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి పరిరక్షించాలన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, నాయకులు శేషారావు, లక్ష్మయ్య, ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రజావాణిలో జిల్లా అధికారులకు ఫిర్యాదు పత్రం నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు

భ్రమరాంబ–మల్లికార్జునస్వామి జాతర షురూ

దుండిగల్: భౌరంపేట్‌లోని శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతామూర్తులను దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌లు జాతరకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, రామగుండం ఎమ్మెల్యే చందర్

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు

జీడిమెట్ల: సీసీ కెమెరాల ఏర్పాటుతో స్థానికంగా నేరాలు, దొంగతనాలను అదుపు చేయవచ్చని జీడిమెట్ల సీఐ పవన్ అన్నారు. చింతల్ న్యూవివేకానందనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్థానికంగా రూ4.21 లక్షలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు పీఎస్ఆర్ టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా సోమవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ చేతుల మీదుగా సదరు సంస్థ ప్రతినిధికి అడ్వాన్స్ కింద రూ.1.21 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సీఐ పవన్ మాట్లాడుతూ కాలనీ వాసుల కాంట్రిబ్యూషన్‌తో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమని అన్నారు. దీంతో పోలీసులు గస్తీ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. కాలనీ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ... సీసీ కెమెరాలు అమర్చిన 45 రోజుల్లో మిగతా బ్యాలెన్స్‌ను పీఎస్ఆర్ టెక్నాలజీస్‌కు అందజేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ జీఎస్‌వీ శ్రీనివాస్‌రావు, సెక్రటరీలు మహేశ్వరరావు, బీఎస్ నాయుడు, సురేష్, నీలమ్‌రెడ్డి, సత్య, భాను తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ఇన్‌స్టాలేషన్‌కు ఇన్‌స్పెక్టర్ పవన్‌తో కలిసి చెక్కును అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

కంటి సమస్యలు దూరం చేసేందుకే కంటివెలుగు

నిజాంపేట్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి 25వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్క్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం మేయర్ స్థానిక కార్పొరేటర్ లక్ష్మీకుమారితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందుతున్న సేవలను మేయర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కంటి సమస్యలతో బాధపడుతున్న వారి ఇబ్బందులను దూరం చేసేందుకే ప్రభుత్వం కంటి వెలుగును ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు చేయించుకుని ఉచితంగా కళ్లద్దాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, ఆవుల పావని, రాజేశ్వరి, శ్రీనివాస్‌యాదవ్, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ వైస్ ప్రెసిడెంట్ రాములునాయక్, మెడికల్ ఆఫీసర్ అజీజ్, డాక్టర్లు మంజుల, కమల, చంద్రిక, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



ఎన్టీఆర్‌నగర్ పార్కులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో మేయర్ నీలారెడ్డి

కొత్త ఆవిష్కరణలకు సైన్స్‌ఫేర్‌లు దోహదం



నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీపోచంపల్లిలోని ఎడ్జిమెంట్ ది గ్లోబల్ స్కూల్‌లో సోమవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను రూపొందించి వాటి పనితీరును వివరించారు. ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలియతీసి కొత్త ఆవిష్కరణలకు సైన్స్‌ఫేర్‌లు దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సైన్స్ నమూనాలను రూపొందించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకురావాలి

కుత్బుల్లాపూర్: మాజీ పీసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో సోమవారం టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయం, బాచుపల్లిలోని జీతేపీర్ దర్గా, గురుద్వారా, మెస్సియ సెంట్రల్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4084 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ద్వారా గడపగడపకు కాంగ్రెస్ విధానాలను తీసుకు వెళ్లడంతో సఫలీకృతులయ్యారని తెలిపారు. ఇదే ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేసి కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సీఎం కేసీఆర్ ఫొటోలు తొలగించాలని మంత్రి ఆదేశాలివ్వాలి'

వైఎస్సార్–టీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి



కుత్బుల్లాపూర్: రాజ్‌భవన్‌లో దేశ ప్రధాని ఫొటోను తొలగించాలని మంత్రి కేటీఆర్ చెప్పడాన్ని మేడ్చల్‌జిల్లా వైఎస్సార్–టీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి సురేష్‌రెడ్డి ఆక్షేపించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలకు కళ్లు నెత్తికెక్కాయని పేర్కొన్నారు. తాము ఒక దేశంలో ఉన్నామన్న సోయ లేకుండా వ్యవహరిస్తున్నారు. ప్రధాని ఫొటో కంటే ముందు రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న సీఎం కేసీఆర్ ఫొటోలను మొదట తొలగించాలని మంత్రి కేటీఆర్ ఆదేశాలు ఇస్తే బాగుంటుందన్నారు. మంత్రి వ్యవహార శైలి రాష్ట్రానికి మంచిది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ సొంత జాగీరు అన్నట్లుగా వ్యవహరిస్తోందని అన్నారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తూ కుటుంబ పాలన కొనసాగిస్తున్న బీఆఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

విజన్ ఫర్ ఇండియా వ్యాసరచనలో సత్తాచాటిన శ్రీజ



విద్యార్థి శ్రీజకు నగదు పురస్కారం అందజేస్తున్న తపాల శాఖ ప్రతినిధులు, మదన్‌మోహన్‌రావు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వ తపాలా శాఖ నిర్వహించిన విజన్ ఫర్ ఇండియా 2047 పేరిట నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన అక్షర స్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. భవిష్యత్ భారతదేశం ఎలా ఉండనుందో ఊహించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అక్షర స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రోహిత శ్రీజ మొదటి బహుమతి పొందింది.

- సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన పోస్ట్‌మాస్టర్, అక్షర స్కూల్ సీఈవో మదన్‌మోహన్‌రావు చేతుల మీదుగా శ్రీజకు రూ.25వేల నగదు బహుమతిని అందజేశారు.అనంతరం విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జానకి, తపాలా శాఖ ప్రతినిధులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు త్వరలోనే తెరపడనుంది

- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్
- ఇంటింటికీ కమలం గుర్తు ఆవిష్కరణ



శ్రీశైలంగౌడ్ ఇంటికి వేసిన కమలం పువ్వు గుర్తును ఆవిష్కరిస్తున్న బండి సంజయ్



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ నివాసంలో బీజేపీ నాయకులతో భేటీ అయిన బండి సంజయ్

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలనకు త్వరలోనే తెరపడనుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన షాపూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాసంలో నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు రాజకీయ, సామాజిక అంశాలతో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ సంస్థాగ నిర్మాణం, ప్రజా సమస్యలు తదితర విషయాలపై చర్చించారు. ఇంటింటికీ కమలం గుర్తు కార్యక్రమంలో భాగంగా శ్రీశైలంగౌడ్ నివాసానికి వేసిన కమలం గుర్తును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎస్. మల్లారెడ్డి, శాంతి కుమార్, కొల్లు మాధవి, జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.